# గులాబీ అత్తరు

ఒక్క అడుగు వేస్తే దివాంజీ కనపడతాడు.

అతగాడొక్కమాటు తమకేసి చూస్తే చాలునని ఆత్రపడుతూనూ, అతని కటాక్షం ఆశించీ, అతని అనుగ్రహం యెదురుచూస్తూనూ, అతని ఆలంబనం నమ్ముకునీ, అతనిచేత "సరే" అనిపించుకోడానికి తగ్గ యెత్తులాలోచించుకుంటూనూ, అయినా, అతని లోభగుణం మాత్రం లోపల్లోపల గర్హించుకుంటూనూ ఆగదిలో పరివేష్టించి వుండిన ఆశ్రితులూ, పౌర ప్రముఖులూ, రాజ బంధువులూ, రాజపురుషులూ కొందరక్కడికే కనపడుతున్నారు.

వారిలో కొందరు తనకేసిన్నీ చూశారు.

అలాంటి చోట నుంచుని, మొదట వొక్కమాటు గదిలోకి తొంగిచూసి, తరవాత నిటారుగా నుంచుని, నుంచున్న వెంటనే తాపీగా రెండుచేతులూ చాపి, గభీమని బిరడా తీసి సీసా గాలివాటాన పెట్టాడు షుకురల్లీ ఖాను, తల వెనక్కి విరుచుకుంటూ.

బిరడా తీశాడు, అంతే, వెంటనే బిగించేశాడు.

కాని, ఆ క్షణమాత్రానికే అతని చుట్టూ వుండిన జవానులు తుళ్ళిపడి మత్తెక్కుతున్నట్టయిపోయారు.

లోపల వుండిన పెద్దమనుష్యులు, ఉలిక్కిపడి యెగ వూపిరి తీసుకుంటూ యిటు చూశారు.

దివానుకి పక్కగానూ కొంచెం వెనకవాటుగానూ నుంచునివుండి, అతని రాతలు ఓరకంట చూస్తున్న ఠాణేదారున్నూ చకితుడై "వచ్చాడా?" అన్నట్టొక మాటు గుమ్మంకేసి చూసి, మళ్ళీ మొగం వంచుకున్నాడు, సాలోచనగా.

అప్పటి కప్పుడే చ్రరున మొగంపైకెత్తి "ఏయ్! ఏమిటీ కంపు?" అంటూ గద్దించాడు దివాంజీ, దగ్గుకుంటూనూ తీక్షణంగా చూస్తూనూ.

దీంతో పండువెన్నెట్లో కటికచీకటి రేఖ విరిసినట్టయింది.

కొంచెం ఘాటుగానే వుండినా, హృదయంగమమైన వట్టి వేళ్ళ అత్తరు కమ్మదనం దివాంజీకి కంపుగా తట్టడంచూసి లోపలివా రందరూ మొగ మొగాలు చూసుకున్నారు, ఉబికిన నవ్వు కళ్ళల్లో కుక్కుకుంటూ

"అరే, అరే" అనుకుంటూ మొగం పక్కకి తిప్పుకుని, ఠాణేదారు పెదవి కరుచుకున్నాడు, తన రసికత గుర్తించ మన్నట్టొక రాజబంధువు కేసి బెల్లించి చూస్తూ.

జవానులున్నూ అందుకు వింతపడి, అపవారించి పెదవులు కరుచుకున్నారు.

ఖాను కొయ్యే అయిపోయాడు.

కంపు అన్నమాట అపశ్రుతిగా కనపడిం దతనికి.

మాంచి పరువైన యాభైయేళ్ళ వయస్సున, అత్తరు సౌరభం కంపుగా వెలపరించుకునే మనిషి కనపడడం అతని కిదే మొదటిసారి.

మొన్న మొన్ననే – రెండు మాసాలపాటు నానాపాట్లూ పడిగాని గోలకొండకోటలో అడుగు పెట్టలేకపోయా డతను.

అసలు, వజీరు దర్శనమే కాలేదు నెలా పదిహేనుదినాలు పడిగాపులు పడివుంచేనేగాని.

ఆ ప్రయత్నంలో, నిజంగా, తల ప్రాణం తోకకు వచ్చిం దతనికి; కాని దర్శనం యిచ్చాక మాత్రం యీ వట్టివేళ్ళ అత్తరుకే ఆ వజీ రెంత ముగ్ధ డయిపోయాడు?

అప్పుడక్కడ వున్నవారున్నూ ఎంత సంబరపడ్డారూ?

తరవాత, నవాబున్నూ యెంత మెచ్చుకోలేదూ ?

మరియిక్కడ, పెద్దాపురంలో, అడుగు పెట్టిననాడే కావలసిన భోగట్టా అంతా దొరికిపోయింది.

మర్నాడు ఠాణేదారు ప్రసన్ను డయిపోయినాడు.

మూడో నాడే కోటలో ప్రవేశం దొరికింది.

అయితే, అంత సౌలభ్యానికీ చివరి కిదా పరిణతి ?

హిందువులలో విభ్రమవిలాసాలకు తగినంత విలవ లేకపోవడం అత నెరుగును.

పోనీ, అంటే నిర్లిప్తత కూడా అంతంతగానే వుండడమున్నూ అత నెరుగును.

అయితే మాత్రం యింత తల్లకిందులా ?

ఇంతకీ అత్తరు సువాసన చెడుకంపుగా బాధపడే మనిషి, రాజు తరవాత రా జంతవా డయి వుండడమా?

రాచ రీవికి ఇది ప్రశంసావహమా ?

దీనివల్ల, మహారాజు ప్రాభవం విషయమూ, వైభవం విషయమూ దివాంజీకి లక్ష్యం లే దనుకోవాలా? లేక మహారాజు ప్రవృత్తి కూడా యిలాంటిదే అనుకోవాలా?

ఇది మిక్కిలీ అసంభావ్యంగా కనిపడిం దతనికి.

"చివరి కేది యెలా సంభవిస్తుందో?" అని అనుమానమున్నూ పట్టుకుంది.

ఇంతమాత్రాన నిరాశ చేసుకోలేదుగాని చేసుకోక తప్పదేమో అన్నట్టు జవాన్లకేసి అభావదృష్టులు పరిపాడతను.

ఈస్థితిలో "ఏయ్ జవాన్?" అని పిలిచాడు ఠాణేదారు, ద్వారంకేసి చూస్తూ.

"చిత్తం బాబయ్యా" అంటూ వెంటనే లోపలికి వెళ్ళి జవాను "డిల్లీ నుంచి అత్తరు వర్తకు డొకడు వచ్చి దర్శనం కోరుకుంటున్నాడండి" అని విన్నవిం చాడు.

దీనిమీద "అతనే, నేను మనవి చేసుకున్న సాయిబేనండి" అన్నాడు ఠాణేదారు, మెల్లిగా; కాని దివాంజీ, మొగం పైకెత్తలేదు.

పైపెచ్చు "దివాణంలోనే అంగడి తెరుస్తాడటనా సాయిబు?" అని ముదలకించాడు, కొంచెం కటువుగా.

ఇది విని ఖాను తెల్లపోయాడు.

జవానే కాదు, ఠాణేదారు కూడా జంకిపోయాడు, అందుకు ప్రత్యుత్తరం చెప్పడానికి.

కాని "చిత్తగించారూ?" అంటూ వొక బోసినోటి శాస్త్రులు మాత్రం అందుకున్నాడు, తన ప్రతిభ చూపించడానికి మాంచి అవకాశం దొరికిందన్న ఉత్సాహంతో, నలుగురి కేసీ చూస్తూ.

అయితే, అప్పుడు కూడా దివాంజీ మొగం పైకెత్తి చూడకపోగా, అతణ్ణి మాత్రం వుద్దేశించి, ఒక్కొక్కమాటకొక్కొక్క పెద్దమనిషి కేసిచూస్తూ "దివాణంలోనే అంగడి తెరుస్తాడటనా?" అంటే చెప్పలేనుగాని, అతను చేసిం దాల్లో మంచి భావుకత మాత్రం కనపడుతోంది. ఏమంటే? ఠాణేదారుగారి పరిచయ వాక్యాలవల్ల అతను ఫలానా అని మాత్రమే తెలుస్తుంది. అతని సామర్థ్యం అజ్ఞాతంగానే వుండిపోతుంది. ఆ విషయం తనకి తానై చెప్పుకోడం యెవరికీ రసికతాముద్రకాదు. అంచేత. తన అత్తరుసువాసనతోనే తన విషయం యావత్తూ విశదపరుచుకున్నాడతను. ఇది చాలా గొప్పగా వుంది. ఢిల్లీలో మసులుకుంటున్న మనిషి కిదొక లెక్కామరి? అక్కడ యెంతంతలేసి ఉమ్రావులున్నారు? వారిదగ్గిర మసులుకునే మనిషి సామాన్యుడయివుంటాడా? చాల బాగుంది. తప్పకుండా చూడతగ్గవాడతను" అన్నాడు శాస్త్రులు, చివరి మాట ఠాణేదారు కందచేస్తూ.

అయినా, దివాంజీ మాట్లాడలేదు.

చూడనే లేదు.

రాస్తూరాస్తూ వుండిన కలంమాత్రం కిందపెట్టేసి పొడుంకాయ అందు కున్నాడతను, అంతే

## 2

"ప్రవేశపెట్టు" అన్నాడు ఠాణేదారు, సరే అనేమాట దివాంజీ ప్రకట పరచే పద్ధతి అని తెలుసు కనక.

ఈ మాటమీద దివాంజీ కనుబొమ్మలు ముడిపడ్డాయి.

ఏదోవొక గంభీరాలోచన అతనిబుర్రలో ప్రవేశిస్తూ అది కళ్ళల్లో తళుక్కుమంది.

తన రసజ్ఞత అంతా వ్యర్థం అయిపోయినందుకు కించపడుతున్న శాస్త్రులు అదిచూసి ఉలిక్కిపడ్డాడు.

అప్పటికప్పుడే వొక్క అంగలో లోపలికి వెళ్ళి "దివాంజీ వారికి కోటి సలాములు. నేను ఢిల్లీనుంచి వచ్చానండి, ఏలినవారి పాదాలు వెతుక్కుంటూ" అన్నాడు ఖాను, చేతులూపుకుంటూనూ, నూడుమాట్లు వంగిలేస్తూనూ.

"ఏమి పని?" అనడిగాడు దివాంజీ దర్పంగా, అతని సలాములు కళ్ళతో అందుకుని.

"నేనత్తర్లు తయారుచేస్తాను మహాప్రభూ! దక్షిణ దేశంలో, గోల్కొండ తరవాత పెద్దాపురం వొక్కటే చూడతగ్గది అని విన్నాను, రెక్కలు కట్టుకు వచ్చి వాలాను, తమరు కటాక్షించాలి" అని వేడుకున్నాడు ఖాను.

"రెక్కలుండడమే వస్తే యెక్కడో వొకచోట వెళ్ళి వాలక, ముడుచుక్కూచుంటాడా మరి యెవడయినా?" అని ముదలకించాడు దివాంజీ.

అందులో వున్న దెబ్బ ఖాను గుర్తించకపోలేదు; కాని "తమరు సరిగా సెలవిప్పించారు మహాప్రభూ! ఏమంటే, రెక్కలున్నందుకు వినియోగం, యెక్కడ సరసులుంటే అక్కడ వెళ్ళి వాలడమే. కనకనే నాలుగు తరాలనాడు, మాకుటుంబం, పారశీకదేశం విడిచి ఢిల్లీవచ్చి వాలింది. వచ్చాక కూడా సైన్యంలో చేరడానికెన్ని అవకాశాలు తటస్థపడినా, పేరుతెచ్చిన కళాజీవిక విడిచిపెట్టలేక అత్తరులే తయారుచేసి ఢిల్లీ పాదుషాల ఆదరగౌరవాలు పొందుతోంది" అన్నాడు, ధోరణి మార్పించదలిచి.

దీంతో "కావచ్చు" అన్నాడు దివాంజీ, కొంచెం వడి మళ్ళి; కాని చూపుల్లో మాత్రం సారళ్యం అంకితం కాలేదు.

"మా నాయనగారి సెలవుపొంది, నేను, దక్షిణదేశ ప్రభువులను సేవించుకోడానికి వచ్చాను. గోల్కొండ నవాబుగారూ, అక్కడి వజీర్లూ మాపరిశ్రమ గుర్తించి మిక్కిలీ ఆదరించారు."

"ఇంకేం?"

"ఇంకేమంటే మనవి చేసుకున్నాను గదా, గోల్కొండ తరవాత పెద్దాపురమే చూడతగ్గదని విన్నానని? ముందు తమరిది చిత్తగించకోరుతున్నాను."

ఇలా అని, ఖాను, మూత తెరిచి వొక చిన్నపెట్టె దివాంజీ సందుకా పెట్టిమీద వుంచాడు.

లోభాగాన, ఎర్రని ముఖమల్ గుడ్డ అతికించిన చక్కని పెట్టె అది. అందులో వొక చిన్నసీసా.

చక్కని నగిషీపనితో యెంతో ముచ్చటగా వుందది.

సీసాలో సగానికి పైగా అత్తరు వుంది.

అది చూసి అక్కడివారందరూ గుటకలు మింగారు.

"అది మల్లె అత్తరు మహాప్రభూ! అందులో వున్నది రెండేతులాలు; కాని రెండువసంతాలకు తయారయిందది"

"వోస్"

"మావస్తువు మర్యాద మాకు మేమయీ చెప్పకోడం ధర్మం కాదు, చిత్తగిస్తే తమకు తెలియందీకాదు. అయితే మొగం కొంచెం యెడంగా వుంచి మరీ మూత తీయించండి మహాప్రభూ"

దీనిమీద, అక్కడివారందరూ తమ ఘ్రాణేంద్రియానికి ఏకాగ్రత అలవరచుకున్నారు; కాని "మాట్లాడాటప్పటికి ముందు మూతతియ్యడమేపనా మాకు?" అనడిగాడు దివాంజీ, దురుసుగా.

ఖాను మళ్ళీ కుతకుత లాడిపోయాడు.

అయితే, అధికారదర్పం వొక్కొక్క మనిషిలో ఎలాంటి పశుప్రవృత్తి రేకెత్తిస్తుందో అతనికి తెలుసు.

లక్షల కొద్దీ అధికారులతో నిండివుండిన డిల్లీ నగరంలో, అతను, మొదట ఆర్జించింది యీ పరిజ్ఞానమే.

ఇలాంటి వాటికి నసాళం అంటేటట్టు బదులు చెప్పడమూ అతనిచేత నవును.

మరొక పనిమీద వచ్చివుంటే అత నందుకు సందేహించకా పోవును.

కాని, యిప్ప డలా చేస్తే కార్యం భంగపడుతుంది.

పారితోషికం కంటే, తన అత్తర్లకు దేవదుందుభులు మోగడం అతనికి మిక్కిలీ అగత్యం.

అది, రాజు యెదుట పడగలిగితేనే సిద్ధిస్తుంది.

రాజసభలు కంటకభూయిష్టాలూ, హింస్రకమృగాకీర్ణాలున్నూ.

పాలకోసం రాయి మొయ్యాలి.

అంచేత, అత నోపికపట్టాడు.

ఇంతేకాదు.

అలాంటి దురుసు మనిషిని, అందుకు తగ్గట్టు మాట్టాడి అంతకంటే యెక్కువగా నొప్పించడం కంటే, తగ్గి మాట్టాడి, దారికి తెచ్చుకుని, పిడికిట పట్టుకుని ఆడించడం కూడా వ్యవహర్తల లక్షణమ్మే.

ఈనిశ్చయంతో అతను "ఏలినవారి—" అంటూ ప్రారంభించాడు; కాని మాట సగంలోనే కలగజేసుకుని, ఠాణేదారు "దివాంజీవారు అది సావకాశంగా చిత్తగిస్తారు, ముందు నువ్వు వచ్చిన పనేమిటో మనవిచేసుకో" అని అందించాడు.

"చిత్తం, చిత్తం" అంటూ మరోపెట్టె తెరిచి దివాంజీ యెదట వుంచాడు ఖాను, ఠాణేదారు సమయ స్ఫూర్తికి కళ్ళతో మెప్పు చూపిస్తూ.

లోభాగాన ఆకుపచ్చ ముఖమల్ గుడ్డ అతికించిన చక్కని పెట్టె అది.

ఎర్రని అత్తరుతో, అపురూపమైన నగిషీపని చేసిన చిన్న సీసా వొకటి, కోటికిరణాల జాతిరత్నం లాగ మెరిసిపోతోంది, అందులో.

అక్కడివారు దాని చక్కదనానికి ముగ్ధు లయిపోయారు; కాని దివాంజీ అటు చూడనే లేదు.

అందుకున్నా నరాలు తోడేసినట్టయిపోయాడు; కాని యేమీ యెరగనట్టు "ప్రభువులకు తెలియంది లేదు" అంటూ ప్రారంభించాడు ఖాను.

"పెద్దాపురం ప్రభువులకు నజరుపెట్టుకుందా మని తయారుచేశా నది. గోల్కొండ నవాబుగారికి వట్టివేళ్ళ అత్తరు మిక్కిలీ ప్రియం అని తెలిసి అదెంత శ్రద్ధగా తయారుచేశానో, పెద్దాపురం మహారాజులుంగారికి గులాబీ అత్తరు మిక్కిలీ ప్రీతిపాత్రం అని తెలిసి యిది అంత శ్రద్ధగానూ తయారు చేశాను. ఆసీసాలో వున్నది వొక్కటే తులం - దాని నిమిత్తం కాశ్మీరం జాతి పువ్వులు వాడాను. ఢిల్లీ పరిసరాల్లో పారశీక జాతులే యెక్కువ. కాశ్మీరజాతి చాలా అరుదుగా దొరుకుతుంది అంచేత, ఆకాస్త అత్తరూ తయారుకావడానికి ఖరాగా రెండేళ్ళు పట్టింది మహాప్రభూ" అని వివరించి చెప్పాడతను.

ఇది విని అక్కడివారు, దాని విశిష్టతా విలవా వూహించుకుని చాలా ఆనందించారు; కాని "ఆశ్చర్యమా?" అనడిగాడు ముందు దివాంజీ, మెల్లిగా.

"గొప్ప వస్తువులు తయారుచెయ్యాలంటే గడియల్లో సాగుతుందా మరి?" అంటూ ఖాను పరిశ్రమ మెచ్చుకున్నాడు తరవాత.

కాని "యెంతకి కిట్టింది పాపం?" అనడిగాడు చివరికి, జాలిపడుతున్నట్టు బెల్లించి చూస్తూ.

ఖాను నిర్విణ్ణు డయిపోయాడు.

అది గుర్తించి, కళ్ళంతా గర్వం చేసుకుని, తలపంకించుకున్నాడు, దివాంజీ.

అతగాడి నిర్విణ్ణతా, ఇతగాడి గర్వరేఖా చూసి, అక్కడి పెద్దమనుష్యు ల్లందరూ చకితు లయిపోయారు.

అనేక రాజసభలూ, ఎన్నో నవాబు దర్బారులూ చూసి, సమస్త మర్యాదలూ అనుభవించిన షకురల్లీఖాను, అనేక శోధనలకు తట్టుకోగలిగిన ఆ కళాశీలి, యీకొత్త దెబ్బకు వూగిపోయిన్నీ, మహారాజు మిక్కిలీ సరసుడని విని వున్నాడు కనక, రాజదర్శనంతో యీ మనోవైకల్యం అంతా పోతుందని ఆశించుకుని, అత్తరు సౌరభం కంపుగా భావించిన అధికారి దగ్గిర యింతకంటే రసికత వుంటుం దనుకోడం తనదే తప్పని తనకి తానే మందలించుకుని, అప్పటికి చేసేది లేక, యీనిర్వణ్ణతా, దీంతో పుట్టిన కోపమూ, ఆవెంటనే వచ్చిన యేవగింపులా అణుచుకుని, వినయమున్నూ తెచ్చుకొని, "అది నజరువస్తువు మహాప్రభూ! దక్షిణదేశాని కంతకీ జాతిరత్నం శ్రీవత్సవాయి ప్రభువు నిమిత్తం ఉద్దిష్ట మైనదిన్నీ. ఈకారణాల వల్ల దాని కిట్టింపు ధర అడగడం మాకు మన్నన కాదండి" అన్నాడు, కళ్ళలో బాధ కనపరుస్తూనే.

దీనిమీద "మరి మాప్రభువులను మీరెంతగా గౌరవిస్తున్నారో మాకు తెలియడం యెలాగా?" అనడిగాడు దివాంజీ అమాయికత్వం నటిస్తూ.

"పెద్దాపురం రాజసభలో యిలాంటి వస్తువుల విలవలు కట్టగలవారు లే రని నే ననుకోగలనా మహాప్రభూ?"

"మా ప్రభువు కోసం ఉద్దిష్టమైన వస్తువు వారి సెలవు పొందకుండా విప్పి చూడడం మాకు ధర్మమే అనుకోనా నేను మరి?"

"మరి ప్రభువుల సన్నిధికి –"

"అది సరే నయ్యా! మేము వారి భృత్యులం కదా, మేమూ కొన్ని విధులు నిర్వర్తించుకోవాలేమో?"

ఎగిసిపడి "ఇదా విధినిర్వహణం?" అన్నట్టు చురుగ్గా చూశాడు, బోసినోటి శాస్త్రులు, కీగంట.

అదలా జరుగుతూ వుండగానే "నేను మనవిచేసుకునేది అదే మహాప్రభూ" అన్నాడు ఖాను.

"ఒకరితో మనవిచేసుకోడానికీ, సొంతానికి సత్యం గుర్తించడానికీ చాలా అంతరం వుంది. మీఢిల్లీలో, వజీర్లు, ఎవరే వస్తువు తెచ్చినా దాని మంచిచెడ్డలు తెలియకుండా అది పాదుషావారి సన్నిధిని వుంచనిస్తారా?"

తల తాటించుకుంటూ దివాంజీ యిలా అడిగాటప్పటికి, ఖాను, నిలువునా నీరయిపోయాడు.

వట్టివేళ్ళ అత్తరు సౌరభంతో అతని యెడల మిక్కిలీ అనురక్తులయి వుండిన పెద్దమనుష్యులు యీ మడత పేచీ గుర్తించి నిర్విణ్ణు లయినారు.

రాజబంధువులలో వొకాయన, ఆపవారించి, దివాంజీ యెడల నిరసన భావం కనపరచగా, బోసినోటి శాస్త్రిలు నుదుట "రాత" అన్నట్టు వేలితో పాముకొని మొగం వంచుకొన్నాడు.

ఠాణేదారు ఇదంతా గుర్తించాడు.

వెంటనే ఖానుణ్ణి సంబోధించి "దివాంజీవా రిప్పుడు చాలా తొందర పనిలో వున్నారు. ఇప్పటికి వెళ్ళిపో, మరోమాటు దర్శనం చేసుకుందువుగాని" అన్నా డతను.

"ఇది బాగుంది" అన్న ట్టందరూ తలలూపుకున్నారు.

అంతమంది పెద్ద మనుష్యులకు తన యెడల సానుభూతి వుండినందుకు తృప్తిపడి, మళ్ళీ సలాములు చెప్పి, బుర్రవంచుకుని వెనక్కి అడుగులేస్తూ బయలుదేరాడు ఖాను.

గుమ్మం దాటాటప్పటికే రెండు పెట్టెలూ తెచ్చి వొక జవాను అతని చేతిలో వుంచాడు.

## 3

ఆరాత్రి తెల్లవార్లూ కంటికి నిద్రలేదు, ఖానుకి.

నోటికి ముద్దకూడా పోలేదు.

బుద్ధిన్నీ మందగించిపోయింది.

కళ్ళు మూసుకున్నా తెరుచుకున్నా దివాంజీ చికిలింపు చూపులే కనపడసాగాయి.

కిట్టింపుధర చెప్పమనడం ఒక్కటే జ్ఞాపకం రాసాగింది.

దీంతో, క్షణక్షణమూ యీ దెబ్బలు తింటున్నట్టే బాధ పడిపోయా డతను.

ఐతే, లోకప్రవృత్తి యేకముఖంగా వుండదు, సత్యమే.

ముక్కుకు సూటిగావెడదామంటే యెవరికీ సాధ్యమూ కాదు, నిజమే.

దీనికి సాయం, ప్రతిఘటనలు తటస్థించితేనే జీవితానికి పరిణతి.

ప్రతిఘటనలు అతిక్రమించగలిగితేనే జీవితానికి విజయమున్నూ. కాని, వొక్కొక్క జీవితానికి హృదయమే పునాది అయితే, మరొక్కొక్క జీవితానికి మేధస్సే ప్రధానం అయివుంటుంది.

ఎక్కడ మేధస్సు ప్రధానమో అక్కడ అనుభూతి తక్కువయి పోతుంది.

అక్కడ సానుభూతిన్నీ పూజ్యమే.

ఏజీవితానికి పునాదిహృదయమో అది కళాబంధురం.

అక్కడే కళలకు పరిణితి.

అక్కడే కళలకు వినియోగం,

అక్కడే తన్మూలంగా ఆనందానుభవమున్నూ.

అలాంటి ఆనందం తాననుభవించాలన్నా, ఇతర్లకు కలిగించాలన్నా ఆ కళాశిలి మహామేధావి అయివుండాలి.

మహా తపశ్శాలిన్నీ అయివుండాలి.

కళావేత్తృతలోనే-కళాసాధనలోనే తనజీవితం పరిపక్వం చేసుకుంటూ వుండాలి.

ఏమంటే?

ఎవరి సంకల్పం విశుద్ధమో, ఎవరిహృదయం కళామయమో, ఎవరిదీక్ష అలోకసామాన్యమో, ఎవరి ప్రాప్యం లోకకళ్యాణమో ఆ కళాశీలుల నిర్మాణాలే ద్వంద్వ భూయిష్ఠమైన భౌతికజగత్తులో ధ్రువతారలయి మెరుస్తూ వుంటాయి.

నిజంగా ఖాను అలాంటి కళాశీలి.

అతని అత్తరు లలాంటి ధ్రువతారలు.

అయినా "అక్కర్లేదు", అని చెప్పేస్తే, వెంటనే అతనర్థమూ చేసుకోగలడు, సులభంగా నిరాశా చేసుకోగలడు, నిర్విచారంగా వెళ్ళిపోనూగలడు; కాని యిదేమిటీ యీ వాలకం?

తన అత్తర్లకు విలవ కేవలమూ డబ్బే అయితే అందుకోసం అతనింత దూరం రానక్కర్లేదు.

ఉన్నవూరే కదలనక్కర్లేదు.

అసలు, ఢిల్లీనగరమే వొక మహాదేశం అంత.

అక్కడే యెందరో ప్రభువులూ, సంపన్నులూను.

వారిలో, ఎందరో రసికులు.

అతని అత్తర్లు కళ్ళకద్దుకునేవారు వారిలో మళ్ళీ వందలూ వేలూను.

అయితే, పెద్దాపురం ప్రభువు, శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ వత్సవాయి చతుర్భుజ తిమ్మ జగపతిమహారాజు రసికత ఢిల్లీలో గుబాళించింది.

ఢిల్లీ పాదుషా రసికతకు వంకలు దిద్దింది.

ఖాను ఆగలేకపోయాడు.

దీక్షపట్టాడు.

తపస్సులో కూచున్నాడు.

అపూర్వసాధన చేశాడు.

తహతహలాడిపోయాడు.

రెక్కలు కట్టుకువచ్చి వాలాడు.

కాని, షష్ఠి గడియలూ పువ్వులతోనే కాలంగడిపే అతనికి, ఇక్కడ ప్రభుదర్శనం గగనపుష్పం అయిపోయింది.

అపూర్వమైన జాతిరత్నం గులకరాళ్ళలో కూడుకుపోయి వుండిన ట్టనిపించిం దతనికి.

వచ్చివచ్చి ముళ్ళకంచెల్లోనూ, మురికి గుంటల్లోనూ పడిపోయినట్టు బాధపడ్డా డతను.

"అంత డిల్లీలోకూడా — అంతంతలేసి వజీర్లయినా చెయ్యలేని కుట్ర యిది" అని పరితపించా డతను.

బయటవుండగా పెద్దాపురం యెంత ఆశకొలిపిందో, వచ్చి ప్రవేశించాక అంత దిగగుంజేసిన ట్టనిపించిం దతనికి.

దక్షిణదేశానికి దక్షిణదేశమే దుష్టమృగ సంకీర్ణం అయిన కీకారణ్యంలా తోచిం దతనికి.

దీంతో "ముక్కూ మొగమూ యెరగనిచోటికి రావడం మనదే బుద్ధి తక్కువ" అని పిసుక్కున్నా డతను.

కాని, తన భృత్యుల చేతిలో వొక కళాశీలి ఎంతక్షోభ పడిపోతున్నాడో మహారాజు కెలా తెలుస్తుందీ?

లోకంలో, యెక్కడా కూడా యిలాంటి అంతరువులు తప్పవంటే సమ్మతమే.

అయితే, ఎంతెంతలేసి ధర్మరాజ్యాలలోనూ, మహోదారులైన యెలాంటి ధర్మప్రభువుల పరిపాలనలోనూ అసంతృప్తి కలిగిం దంటే - ఏవగింపు పొట మరిచిం దంటే - విరోధభావం పుట్టుకువచ్చిం దంటే-కల్లోలాలు చెలరేగాయంటే అక్కడి కార్యనిర్వాహకుల యిలాంటి అతి లౌక్యాలవల్లనే.

కాని, యేది యేమయినా, ఎంతచూసినా ఖాను కిక్కడ వొక్కటే ఫలితం.

అంచేత "సన్మానం మాట దేవు డెఱుగును, మర్యాదగా అయినా యిక్కణ్ణుంచి వెళ్ళగలమా?" అని బెంగ పట్టుకుం దతనికి.

ఇలా వుండగానే కోళ్ళుకూశాయి.

పనిలోపని కాకులు కూడా కూసేశాయి.

# 4

తెల్లవారడం తడవుగా వెళ్ళి ఠాణేదారు పాదాలమీద వాలాడు ఖాను.

ఇంతవరకూ అంత గొప్ప ఆత్తర్లు పెద్దాపురం కోటకు రాలేదు, ఠాణేదారుకి తెలుసు.

ఖానుకి మంచి సమ్మానం జరగడం దివాంజీకి సుతరామూ యిష్టం లేదు, ఇదీ తెలుసు అతనికి.

బుర్ర యెగిరిపోడానికి కయినా వొప్పుకుంటాడు; గాని, ఖాను, కిట్టంపు ధర చెప్పడు, ఇదిన్నీ తెలుసు అతనికి.

చూశా డంటే, మహారాజు, ఖాను అత్తర్లు విడిచిపెట్టడు. ఇది, ఆసమయంలో, దివాంజీ దగ్గిర వుండినవారందరూ గుర్తిం చేశారు.

ఠాణేదారు ఆలోచించాడు.

ఉండుండి "సాహసించగలవా?" అనడిగా డతను.

"మానం నిలిచేటట్టు లేదు. ఇక ప్రాణా లెందుకూ? ఆజ్ఞాపించండి" అంటూ ప్రాధేయపడ్డాడు ఖాను,

"ఇక నువ్వు కోటలో ప్రవేశించడం అసాధ్యం. ప్రవేశించినా ముందుకి వెళ్ళగలగడం అబద్ధం. వెళ్ళినా నిలిచి వుండడం దుర్ఘటం. ఇన్నీ జరిగితే మాత్రం నీకోరిక సఫలం అవుతుంది, తప్పదు"

"సెలవిప్పించండి"

"మహారాజు, దినమ్మూ నాలుగ్ఘడియల పొద్దువేళ పంచకళ్యాణి మీద కొండల్లోకి షికారు వేంచేస్తారు"

"సెలవిప్పించండి"

"కోట ప్రాకారం దాటకుండా నువ్వు వారి కళ్ళబడాలి. కనీసం నీవట్టి వేళ్ళ అత్తరు వయినా వారి నాకర్షించాలి.

"సెలవిప్పించండి"

"దివాంజీవా రిదివరకే యిది వూహించి వుంటారు. ఇందుకు ప్రతిక్రియ ఆలోచించి వుంటారు. ఆజ్ఞలుమాత్రం యింతవరకూ పుట్టలేదు"

"సెలవిప్పించండి."

"నీకు అదృష్టం వుంటేనే ఆయన కిది మరుపు వస్తుంది. మహారాజు పెట్టిపుట్టినా మరుపువస్తుంది. లేదూ, నువ్వు కోటలో ప్రవేశించలేవు"

"సెలవిప్పించండి"

"నావల్ల కాతగ్గ దింతే. ఇక యేటి కడ్డపడు"

ఖానుకి ఊపిరి తిరిగింది.

"నిన్న నేను దాఖలుచేసుకున్నది చందినీ అత్తరు. ఇదిగో, యిదిన్నీ స్వీకరించండి, దివాంజీవారికి నామీద అనుగ్రహమూ లేకపోయింది, యిది వాడుకునే యోగ్యతా లేకపోయింది, యెవ రేమి చెయ్యగలరూ? తమరి చివరి వుపాయం చెప్పారు. బతికివుంటే నేను తమమేలు మరువను"

ఇలా చెప్పి, మూడుమాట్లు వంగి సలాములున్నూ చేసి ఖాను వెళ్ళిపోయాడు.

## 5

ఖాను, కోటలో ప్రవేశించాడు.

వంశధార దాటి అనుమానిస్తూనే పదడుగులున్నూ వేశాడు; కాని యింతలో "అరే, అరే" అని నాలుకలు కరచుకుంటూనూ, "ఎక్కడి కెక్కడి" కంటూనూ వచ్చి నలుగురు సిపాయీలు అతణ్ణి అటకాయించారు.

ఖానుకి, వెంటనే రక్తం వుడుకెత్తిపోయింది.

చూపులు చెదిరిపోయాయి.

కాని, స్వప్రయత్నంగా నిలవరించుకుని "నేను దివాంజీవారి దర్శనానికి వెడుతున్నాను, నన్నెందు కడ్డుకుంటారూ?" అనడిగా డతను.

"ఇప్పుడు వీలులేదు పోపో" మన్నారు సిపాయీలు.

"నేను పాతవాణ్ణే నయ్యా! నిన్న సాయంత్రం వొక పనిమీద మాట్టాడే వున్నాను. అవ్యవహారం పూర్తిచేసుకోడానికే వెడుతున్నాను"

"అయితే, వెళ్ళి వారి లోగిటి దగ్గిరే కనిపెట్టుకుని వుండు, లోటేం?"

"పోనీ, ఠాణేదారుగారి కచేరీకి తీసుకువెళ్ళండి"

"వా రిప్పుడు దివాంజీగారి సన్నిధిని వున్నారు, నీకు కనపడరు"

"వారు వచ్చేదాకా కనిపెట్టుకుని వుంటాను."

"ఆపని వారి యింటి దగ్గిర, కోటలో వల్లకాదు"

ఇలాగ యుక్తులమీద యుక్తులు కురిసిపోయాయి.

వాటిని ఒరుసుకుంటూ కాలంకూడా గడిచిపోయింది.

"ప్రాకారంలో నిలవగలిగితేచాలు" అని ఖానుకి సలహా.

లోపల్లోపల అతను ధన్యవాదాలు చెప్పుకుంటూనే వున్నాడు.

ముందుకడుగు పడనివ్వవద్దని సిపాయిలకు దివాంజీ ఆజ్ఞ.

అందుకు వారున్నూ మురిసిపోతూనే వున్నారు.

ఇంతలో, ఆచుట్టుపట్ల పనిచేస్తున్నవారందరూ వచ్చి మూగారు.

వచ్చేపోయేవారున్నూ నిలిచిపోయారు.

చూస్తూ వుండగానే, మహారాజు చదరంగ సహచరులూ, దశావతారీ స్నేహితులూ వచ్చారు.

వారున్నూ నిలిచిపోయారు.

పాటకజనమేకాక, పెద్దమనుష్యులున్నూ పోగయినందుకు ఖాను సంతోషించాడు.

"ఏమిటేమిటి?" అన్నారు కొందరు.

ఖాను తన అవస్థ అంతా చెప్పుకువచ్చాడు.

దానిమీద, సిపాయీలు, తమ అసహాయస్థితి చెప్పారు.

ఇలాగ వొక్క గడియ గడిచింది.

"ఇంకో అరగడియ" అని యెవరో అన్నట్టయింది ఖానుకి.

కాని, అంతవరకూ అతణ్ణి అక్కడ నిలవగలిగినందుకు ఆనందిస్తున్న సిపాయీలు, మరొక్కడు పరుగుపరుగున వచ్చి యేదో చెప్పగా "ఇక దయచెయ్యి" అనడం ప్రారంభించారు.

"రాజు బయలుదేరుతున్నాడు. అంచేతనే వీళ్ళు హెచ్చరిస్తున్నారు. ఇక గెంటుతారు" అని గుర్తించాడు ఖాను.

చిరవాంఛా, దీర్ఘశ్రమా యిలాగ వ్యర్థం అయిపోతున్నందుకు చాలా చాలా కుమిలిపోతున్నా డతను.

చివరి కతను, వుండిన వారిలో పెద్దమనుష్యులుగా కనపడుతున్నవారి నుద్దేశించి "పెద్దాపురం రాజ్యంలో కళాకారుల కిదా సన్మానం?" అని నిక్కచ్చిగా అడిగాడు.

అంతే.

దాంతో అతని శరీరం వొణికిపోయింది.

కళ్ళెర్రబడ్డాయి.

చూపులు నిశితబాణాలయిపోయాయి.

ఈస్థితిలో చర్రున గులాబీ అత్తరు పైకి తీశాడతను.

అందరూ చూపు లప్పగించేశారు.

"ఇది పెద్దాపురం ప్రభువుకోసం తయారుచేశాను" అంటూ, ముందు, సీసా చేతబుచ్చుకుని పెట్టె కిందికి విడిచి పెట్టేశా డతను.

తరవాత "నిద్రాహారాలుమాని తయారుచేశా" నంటూ మళ్ళీ అందుకుని "డిల్లీపాదుషావారు అటూ, పెద్దాపురం ప్రభువ్వారు ఇటూ" అన్న గౌరవ

భావంతో నాశక్తి అంతా వినియోగించి బొట్టుబొట్టుగా కూడబెట్టానిది. ఒక్కరాకతో దక్షిణదేశంలో నాపేరు నిలిచిపోతుందన్న పేరాసతో నారక్తం అనుకుంటూ కూడబెట్టానిది. అయితే, "పెద్దాపురం ప్రభువు ఎంత సరసులో వారి పరివారం అంతవిరసమైనది." అని నేను ఇక్కడికి వస్తేగాని తెలుసుకోలేకపోయాను. గులాబీపువ్వు సౌరభం ఎంతదూరమో వ్యాపిస్తుంది; కాని దాని ముళ్ళప్రభావం ఉన్నచోటనేగాని వెల్లడికాదుగా? ఇది నాకు కాదు అమర్యాద. ఇది నా గులాబీ అత్తరుకున్నూ కాదు అగౌరవం. ఇది పెద్దాపురం మహారాజు కందించడానికి నాకిక మార్గాలులేవు అయితే, యిది వెనక్కి తీసుకువెళ్ళడం నాకేకాదు, మా కుటుంబానికే శిరచ్ఛేదం ఇక నాకుండుకున్న తృప్తి వొక్కటే. దివాంజీవారి అతిలౌక్యంతో కనుమూసే మహారాజులుంగారి స్వచ్ఛకీర్తి, ఢిల్లీ నివాసి షుకురల్లీ ఖాను గులాబీఅత్తరు సౌరభంలో కలకాలమూ గుబాళిస్తూ, వుంటుంది. చాలు నాకిది" అంటూ పూర్ధ్వశ్వాసతో కోటగోడకి విసిరికొట్టాడతను సీసా.

సీసా ఛళ్ళుమంది.

సీసాపెంకులు ఘళ్ళున చెదిరిపడ్డాయి.

రాజసఖుల హృదయాలు రువ్వుమన్నాయి.

ఆప్రదేశం అంతా అత్తరు సౌరభంతో గుమ్ముమంది.

అందరూ ఆ పరిమళానికి మత్తెక్కుతున్నట్టయారు.

ఒక్క క్షణానికి తెలివివచ్చి అందరూ కళ్ళెత్తి చూశాటప్పటికి, హఠాత్తుగానూ అప్రయత్నంగానూ వెనక్కి తిరిగి చూసి ఖాను కొయ్యయిపోయాడు.

అదేమిటో అని అందరూ వెనక్కి తిరిగిచూడగా, పంచకల్యాణిమీద, శ్రీ శ్రీ శ్రీ శ్రీవత్సవాయి చతుర్భుజ తిమ్మజగపతి మహారాజు అరకంట చూస్తూ నొక్కి వున్నాడు.

మోర పైకెత్తుకుని వుండి, పంచకల్యాణి, ఉండుండి స్వప్రయత్నంగా ఊపిరితీసుకుంటోంది.

* * *

ఇప్పటికి; ఆ ప్రదేశంలో, గులాబీ అత్తరు సౌరభం గుబాళిస్తూనే వుంటుందంటారు చూసివచ్చినవారు.

ఆంధ్రశిల్పి 1947 సెప్టెంబరు,
అక్టోబరుల సంయుక్తసంచిక నుంచి

(15 నిముషాలకు సరిపోయేటట్టు కుదించి 16-8-47 తేదీ సాయంత్రం 7-30 నిమిషాలకు మద్రాసు రేడియోలో చదివిన కథ యిది.)